# తెలుగు జానపద కళారూపాలు

**డాక్టర్. మండి అన్వర్ హుసేన్**

**అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు**

**ఉస్మానియా కళాశాల, కర్నూలు-1**

**సెల్ : 94406 55230**

సాహిత్యం నిరంతరం ప్రవహించే జీవనదిలాంటిది. దానికి ఆది, అంతం వెతకడం కష్టం,ఎక్కడో,ఎప్పుడో పుటి,పెరుగుతూ వికసిస్తూ పరిపూర్ణమైనతన ప్రభావంతో నిత్యనూత్వనత్వతో అలరారుతూ ఉంటుంది.ఏ సాహిత్యాని కైన జానపదసాహిత్యమే మొదటిది.

"జననాం పదం జానపదం! అని వ్యుత్పత్తి,అంటే జనులకు నెలవైనది అని అర్థం. జనపదం అంటే పల్లటూరని అక్కడ నివసించే వాళ్ళు జానపదులని ఒకప్పుడు భావించే వాళ్ళు. ఇప్పుడా నిర్వచనం సరిపోదు. జానపద సాహిత్యం నేడునిత్య వికాసంతో అలరారుతూ అనేకమైన సాహిత్య ప్రక్రియలను అంటిపెట్టుకొని ఉంది. ప్రతి ప్రక్రియా మనోజ్ఞమైన భావాలతో పండితులకు, పామరులకు మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తూ,వారి ఆచారాలకు, అలవాట్లుకు అద్దం పడుతూ శారీరక శ్రమను మరిపిస్తూ జానపదుల జీవితాలను దేదీప్య
మాన్యంగా వెలిగిస్తూ ఆనందాన్ని అందిస్తున్నాయి.

ప్రతిభాషలోను సాహిత్యం మొదట వాగ్రూపంలో వెలువడి, మౌఖికంగా తరతరా నుంచి సంక్రమిస్తూ వచ్చింది,దాన్నేమనమీనాడు జానపద సాహిత్యం అని పిలుస్తాన్నాం.ఆ మాటకోస్తే లిపి లేని భాషల్లో కూడా జానపద సాహిత్యం పుష్కలంగా వ్యాప్తిలో ఉంది.

అక్షర జ్ఞానంలేని గ్రామీణులు, సామాన్యులు, ఏనాడో అప్రయత్నంగా సృష్టించుకోగా అలిఖితంగా ఒక తరం నుంచి మరోతరం వాళ్ళకుసంక్రమిస్తూ వస్తున్న జానపద సాహిత్యంలో అనేక ప్రక్రియలతో పాటు కొన్ని కళారూపాలు కూడా పుట్టుకొచ్చాయి. జానపద సహిత్యంలోని ఏ ప్రక్రియకైనా వస్తువు జనసామాన్యమే, సామాన్యుల కష్ట నిష్ఠూరాలే, అందుకే ఆ సాహిత్యం రసవత్తరంగా ఉంటుంది.

జానపదుల గేయాలైనా,కథలైనా, నృత్యాలైనా, ఆటలైన అన్నింటికి శరీర శ్రమను మరిపించే ఓ దివ్య శక్తి ఉంటుంది.

జనపదాలుగా పిలిచే గ్రామీణ ప్రాంతాలలో పుట్టి పెరిగిన కళలే జానపదకళలు. ఈ కళలు కూడా జానపదుల జీవితాలలో ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని, ఆనందాన్ని నింపుతూ వారి కష్టాలను మరిపిస్తూ మురింపజే స్తూ, జన జీవన సంస్కృతిని జాగృతం చేస్తూ, జీవన ప్రవాహంలా ఒక తరం నుండి మరోతరానికి సంక్రమిస్తూ వస్తున్నాయి.

తెలుగువారికిప్రత్యేకమైన ఎన్నో జాపద కళారూపాలు ఉన్నాయి. సంగీత, సాహిత్య,నృత్య, ఆహార్యాలలో జానపద కళాశైలి ప్రదర్శించే ఈ జానపద కళారూపాలను స్థూలంగా ఐదువిభాగలుగా వర్గీకరించవచ్చు. మొదటిరకం జానపద నృత్యాలు, రెండవది కథాగానాలు, మూడవది గాననాటకాలు, నాల్గవది బొమ్మలాటలు, ఐదవది జంతువులతో ప్రదర్శించే ఆటలు. ఈ కళారూపాలను వాటి ఉద్దేశాలను విధానాలను సమగ్రంగా పరిశీలిద్దాం.

**I. జానపద నృత్యాలు :**

జానపద నృత్యాలు వాటిలో పాల్గొనే వారిని బట్టి మూడువర్గాలుగా విడదీయవచ్చు

అ) స్త్రీ, పురుషులు కలిసి చేయు జానపద నృత్యాలు

ఆ) పురుషులు మాత్రమే చేయు జానపద నృత్యాలు

ఇ) స్త్రీలు మాత్రమే చేయు జానపద నృత్యాలు

**అ) స్త్రీ, పురుషులు కలసి చేయు జానపద నృత్యాలు :**

**1) యక్షగానం:** ఇది దేశీయ చందోబద్దమైన నాటకం, శ్రీనాధుడి కాలం నాటికే యక్షగాన ప్రక్రియ ప్రాచుర్యంలో ఉంది. "కీర్తింతురెద్దాని కీర్తి గాంధర్వులు గాంధనర్వమున యక్షగాన సరణి" అనడాన్ని బట్టి ఇది ప్రత్యేకమైన గానసరలి అని తెలుస్తోంది. గేయప్రాదాన్యం ఉన్న యక్షగానంలో కురవంజి ప్రభావం వల్ల నృత్యానికి కూడా చోటు లభించింది. "సౌభరి చరిత" మొదటి యక్షగానం అంటారు. కాని మనకు లబించిన యక్షగానల్లో కందుకూరి రుద్రకవి సుగ్రీవ విజయమే మొదటిది. చక్కని ఆహార్యం, గానం, నృత్యాలు,మేలు కలయిక అయిన యక్షగానం నుంచే 'వీధి నాటకం' ఆవిర్భవించింది.

**2. వీధి నాటకం :** ఇది వీధుల్లో చేసే సంగీత, నృత్యాలతో కూడిన నాటకం,ఇందులో రామాయణ, భారత పురాణకథలు ప్రదర్శించేవారు. ఈ ప్రదర్శనలో కూచిపూడి భాగవతులు ప్రసిద్ధి చెందారు. ఇందులోని పాత్రలు తమకు తాము పరిచయం చేసుకుంటాయి. ఉదా:రాజు పాత్రధారి"రాజు వెడలె రవి తేజములలరగ" అని పాడుతూ రంగ ప్రవేశం చేస్తాడు.

**3. కలాపం :** దీనిని యక్షగానానికి రూపాంతరంగా భావిస్తారు. ఆట,పాట, అభినయాలతో పామరులను సైతం ఆరిక్షంచడంలో కలాపాలు ప్రసిద్ధి చెందాయి. కలాపాలకు జన్మస్థానం కూచిపూడి అని భావిస్తారు. భామాకలాపం, గొల్లకలాపం, చోడిగాని కలాపం మొదలైనవి ప్రసిద్ధ కలాపాలు, భామాకలాపంలో బ్రాహ్మణునిడికి సత్యభామకు,గొల్లకలాపంలో బ్రాహ్మణుడుకి గొల్లభామకు మధ్య సంవాద రూంలో నృత్య, సంగీత, అభినాయాలతో కథ నడుస్తుంది. చోడి గాని కలపాం హాస్యభరితమైనది.

**4. గరికలు :** ఈ నాట్యం గోదాపరి జిల్లాల్లో ప్రాచుర్యంలో వుంది. గరిక అనే మట్టి పాత్రను గంగమ్మ తల్లికి ప్రతిరూపంగా భావిస్తారు. ద్రౌపతి ఈకుండను నెత్తినపెట్టుకొని నాట్యంచేసిందట.గ్రామ ఉత్సవ సమయాల్లోపూజారి గరికను నెత్తిన పెట్టుకొని ఊరేగుతాడు. ఆసమయంలో భక్తులు ఆ గరికలో బియ్యం, పెరుగు, తినుబండారాలు వేస్తారట. ఈ నృత్యం చేసేవారు రంగురంగుల దుస్తులు ధరించివేగంగా నృత్యం చేస్తారు.

**ఆ) పురుషులు మాత్రమే చేయు నృత్యాలు :**

**1. వీర నాట్యం :** జానపద నృత్యాలలో వీర నాట్యం చాలా ప్రసిద్ధి చెందింది. శివుని మీద భక్తిని ప్రదర్శిస్తూ వీరశైవులు ఈ నాట్యాన్ని చేస్తారు. ఈ నృత్యం భయంకరంగా ఉంటుంది. శివభక్తులు వీరతాళ్ళు అనే పదునైన చువ్వను బుగ్గలో,నాలుకలో, పెదవుల్లో పొడచుకుంటూ వీరావేశం ప్రదర్శిస్తారు. ఇలాచేస్తే శివుడు అనుగ్రహిస్తాడని వీరి నమ్మకం. వీరశై ఉద్యమంలో భాగంగా ఈ నాట్యం ఆవిర్భవించింది.

**2. కోలాటం :** కోలాటానికి దండవర్తనం, దండరాసకం అని కూడా పేర్లులున్నాయి. ఈ నృత్యం ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాల్లో ప్రాచుర్యంలో ఉంది. పూర్వం స్త్రీలు మాత్రమే ప్రదర్శించే వారిని సాహిత్య ఆధారాలున్న ఈ నృత్యం నేడు పురుషులే ప్రదర్శిస్తున్నారు ఉత్సవాలు, పండగ సమయాలలో 'కోలుకోలుకోలే కోలన్న కోల్‌కోలే' అంటూ కోలాలు అనే కర్రలతో ఒకరి కర్రలను మరొకరు లయబద్దంగా కొట్టుకుంటూ వలయాకారంలో ఒకే పాట పాడుతూ బృంద నాట్యం చేస్తారు.

**3. డప్పు నృత్యం :** ఆంధ్రప్రదేశ్ గ్రామసీమల్లో తప్పెట చాలా ముఖ్యమైన వాయిద్యం.గ్రామాలలో సభలో జరగాలన్నా ఏ విషయాన్నైనా ప్రజలకు తెలియ జేయాలన్నా తప్పెట సాయంతోనే చాటింపు వేస్తుంటారు. వేపచెక్కతో చేసిన వృత్తాకార కట్టెకు తోలును అతికించి ఈ వాయిద్యం రూపొందిస్తారు. దీనిపై రెండు కర్రలతో లయబద్ధంగా కొడుతూ చిందులు వేస్తారు. ఈ డప్పు నాట్యాన్నే రాయల సీమలో 'కనకతప్పెట్టు' అంటారు.

**4. తప్పెట గుళ్ళు :** ఉత్తరకోస్తా జిల్లాలలో ఈ జానపద కళారూపం ఉంది. గొల్లకులానికి చెందినవారు ఈ నృత్యాన్ని చేస్తారు. వీరికి ఆరాధ్యదైవమైన గంగమ్మ పేరుతో జాతర జరుపుతారు. ఆ సమయంలో ఈ యాదవులు తమ రొమ్ములపై తప్పెటగుళ్ళు కట్టుకొని వాయిస్తూ పాడుతూ చిందులు వేసి చూపరులకు ఉత్సాహ ఉద్వేగాలని కల్గించి ఆనందడోలికల్లో తేలుస్తారు. ఇది కళింగ దేశంలోని సంగీత నాటకరూపం. ఇందులో రామాయణ, భారత కథలు, బొబ్బిలి యుద్ధం కథలు చెబుతూ, కీర్తనలు పాడుతూ ప్రేక్షకులను ఆనందపరుస్తారు.

**5. గొరవయ్యలు :** గొరవయ్యలు అంటే మైలారు దైవుని భటులని అర్థం. వీరు శైవభక్తులు మైలారు దేవుడుశివుడికి చెందిన రూపం. మణిమల్లాసురులను అంతం చేయడానికి శివుడు ఈ అవతారం ఎత్తాడట. ఈ రూపంలో శివుడు పొడవైన దోవతి ధరించి శిరస్సున తోలు టోపితో, ఒక చేత ఢమరుకం మరొక చేతిలో త్రిశూలం ధరించి ఉంటాడు. ఈ నృత్యం కర్నూలు జిల్లా ఆలూరు మండలంలో మరియు అనంతపురం జిల్లాలో కన్పిస్తుంది.

**6. ఉరుములు :** ఉరుము అనేది డప్పులాంటి వాయిద్య పరికరం. ఉరుములు, పిడుగుల్లాంటి శబ్దం ఈ వాయిద్యం నుంచి పుడుతుంది కాబట్టి దీనికి ఆ పేరు వచ్చింది. దీన్ని వాయిస్తూ ఆ శబ్దానికి అనుగుణంగానృత్య ప్రదర్శన సాగుతుంది. తలపాగ, వెండినాణేలతో తయారయినదండ, వంటి నిండాపసుపు కుంకుమ పొడవాటి దుస్తులు, నడుముదాకా వేలాడదీసుకున్న ఉరుము వాయిద్యం ఈ వాయిద్యం వెలుపరచే శబ్దం మెడలో దండ శబ్దానికి అనుగుణంగా ఉంటూ వెరసి ఈ నృత్యం చేసేవారు వీరభద్రున్ని తలపిస్తారు. ఇది శైవమతానికి చెందిన నృత్యరీతి. కర్నూలు, అనంతపురం ప్రాంతాల్లో జంగమ్మ, తిమ్మమ్మ జాతర్లలో ఈ నృత్య ప్రదర్శనను ప్రదర్శిస్తారు.

**7. నామాల సింగడు :** ఇది వృష్టి నృత్యం, పీర్లపండుగ సందర్భంలో కడప జిల్లాలో ఈ నృత్యం ప్రదర్శింప బడుతుంది.ముఖానికి నామాలు పెట్టుకొని, తలకు వేపమండలు,కాళ్లకు గజ్జలు,చేతులకు గొలుసులు వేసుకొని సింగండు నృత్యం చేస్తారు.

**8. జ్యోతి నృత్యం :** ఇది రాయలసీమ ప్రాంతంలో చౌడమ్మ దేవతను కీర్తిస్తూ పెద్ద పెద్ద జ్యోతులను (దీపపు దిమ్మలు) నెత్తిమీద పెట్టుకొని పాటలూ పాడుతూ ఈ నృత్యం చేస్తారు. బృందంలోనిసభ్యులు ఒకే రకమైన దస్తులు ధరించి ఈ నృత్యం చేస్తారు.

**9.సిద్ధినృత్యం :** ఇది హైదరాబాద్‌లో ఎక్కువ కనిపిస్తుంది. సిద్దీలు అంటే ఆఫ్రికా నుంచి వచ్చిన నిజాం అంగరక్షకులు. వీరు ఖడ్గాన్ని చేత్తో తిప్పుతూ, డప్పు వాయిద్యానికి అనుగుణంగా లయబద్ధంగా నృత్యం చేసేవారు. అయితే ఈనాటికీ ఈ నృత్యం వారసత్వంగా వస్తూ వివాహవేడకల్లో మొహరం సందర్భాలల్లో కనిపిస్తుంది.

**ఇ. స్త్రీలు మాత్రమే చేయు జానపద నృత్యాలు :**

**1. గొబ్బి నాట్యం :** కోస్తా ప్రాంతంలో సంక్రాంతి పండుగ రోజు ఆడపిల్లలు చేయు నృత్యం ఇది.ఆవు పేడతో గొబ్బెమ్మలను పెట్టి వాటిని అందమైన ముగ్గుల మధ్యలో ఉంచి పసుపు కుంకుమ,గుమ్మడిపూలతో అలకంరించి స్త్రీలు దాని చుట్టూ తిరుగుతూ చప్పట్లు కొడుతూ పాటలు పాడుతూ నృత్యం చేస్తారు.

**2. బతుకమ్మ :** ఇది తెలంగాణా ప్రాంతంలో స్త్రీలు ప్రదర్శించే నృత్యం. దీన్ని దసరా పండుగ కాలంలో ఆవు పేడతో చేసిన బతుకమ్మను (లక్ష్మీదేవి) పూజిస్తూ చుట్టూ తిరుగుతూ స్త్రీలు పాటలు పాడుతూ నృత్యం చేస్తారు. ఈ బతుకమ్మను గురించి ఒక కథ ప్రచారంలో వుంది. ధర్మాంగ,సత్యవతి అనే రాజదంపతులకు సంతాన నష్టం కలగడం వారు లక్ష్మీదేవిని పూజించడం ఆమె వారికి పుడ్డడం. గౌరీదేవి ఆ బిడ్డను "చిరకాలం బతుకమ్మా!" అని ఆశీర్వదించడంతో ఆమెకు ఈపేరు స్థిరపడింది.

**3. బొడ్డెమ్మ :** ఇది కూడా తెలంగాణా ప్రాంతంలో బతుకమ్మ పండుగకు ముందు జరుపుకునే పండుగ. ఈ బొడ్డెమ్మ నృత్యం పెళ్ళి కాని ఆడపిల్లలు మట్టితో చేసిన బొడ్డెమ్మ విగ్రహంపై కలశం పెట్టి పూలతో అలంకరించి దాని చుట్టూ తిరుగుతూ చప్పట్లు కొడుతూ నృత్యం చేస్తారు.

**4. కురవంజి :** ఇది ప్రాచీన జానపద కళారూపం కురవంజి అనే పేరున్న ఎరుకల స్త్రీ ప్రదర్శించే నృత్యమే కురవంజి. ఒక ఎరుకలస్త్రీ తనకు సాముద్రికలక్షణాలు తెలుసునని చెబుతుంటే నటి, విదూషకుడు, సింగీ,సింగడు వంటి పార్తలు నృత్యం చేస్తాయి. కాలక్రమములోఈ కురవంజి పాత్ర సోదెచెప్పే ఎరుకలసానిగా మిగిలి పోయింది.

**5. జక్కికి నృత్యం :** జిక్కికి ఆడడం అనేది రాయలసీమ జిల్లాల్లో కనబడుతుంది.స్త్రీలు ఎదురెదురుగా నిలబడి చప్పట్లుకొడుతూ వలయాకారంగాతిరుగుతూ ఆడటం కనువిందు చేస్తుంది. వివిధ జాతర్లలో, తిరునాళ్ళల్లో ఈ ప్రదర్శనలు కన్పిస్తాయి.

**II. కథాగానాలు :**

**1. హరికథ :** సంగీత సాహిత్యాల మేలుకలయికగాప్రేక్షకులను రసాభిముఖంచేయగల కళారూపం హరికథ. హరిదాసుగా పిలిచే కథకుడు భాగవత, భారత, రామాయణ, కథలను రసరమ్యంగా గానంచేస్తూ, చిడతలు వాయిస్తాడు వాయు వీన, మృదంగం వంటి వాయిద్యాలు కథకుడికిసహాయ పడుతుంటాయి. ఆదిభట్ల నారాయణదాసు హరికథ పితామహుడుగా ప్రసిద్ధి చెందాడు.

**2. బుర్రకథ :** బుర్రకథ 12వ శతాబ్దం నాటికే ప్రాచుర్యంలో ఉన్నట్లు తెలుస్తోంది. నాటి సమాజంలో నెలకొని వున్న శైవ, వైష్ణవ కలహాల్లో బుర్రకథను ఆయా శాఖలు వారు తమ ప్రచరానికి ఉపయోగించుకున్నాయి. వీటికి జంగం కథలనే పేరు కూడా వుంది. జంగాలవారు ఎక్కువగా ఈకథలు చెప్పడం వల్ల ఆ పేరు వచ్చింది. వీర,కరుణ రసాలు అద్భుతంగా రక్తి కట్టించగల కళా ప్రక్రియ ఇది.కథకుడు కథ చెబుతూ "బుర్ర"ను వాయిస్తూ ఉంటే మరో ఇద్దరు కళాకారులు 'తందానతాన" అంటూ వంతపాడుతూ ఉంటారు. నాజర్ ఈ కళలో ప్రసిద్ధుడు.

**3. జంగం కథ :** వీర శైవ భక్తలు దీన్ని ఆలపిస్తారు. ఇది ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాల్లో కనిపిస్తుంది. ముగ్గురు కళాకారులు శైవ సంబంధమైన కథను గాన రూపంలో పాడి వినిపిస్తారు. ప్రధాన గాయకుడు తంబుర వాయిస్తూ రెండు ఇత్తడి అందెలను బొటనవేలికి పెట్టుకొని దానికి రంగు గుడ్డను వేలాడదీస్తూ పాడపాడుతూ ఉంటే సహాయకులిద్దరూ గుమ్మటాలు వాయిస్తుంటారు.

**4. జముకుల కథ :** గ్రామ దేవతల్ని కొలుస్తూ జముకుఅనే ఒక వాయిద్యాన్ని వాయిస్తూ వివిధ పౌరాణిక ఇతివృత్యాలను పాడి వినిపించడం ఇందులో కనిపిస్తుంది. కల్లుతాగి పాటకు అనుగుణంగా చిందులు వేస్తూ బలిపశువు మెడను (మేక) నోటితో కొరకడం కొన్ని సందర్భాలలో నెత్తురు కూడాతాగుతూ పేగులు మెడలో వేసుకొని పాడుతుంటారు.

**5. ఒగ్గు కథ :** తెలంగాణాలోని ప్రత్యేక కథా గాన రూపం ఇది కరుమ అనే జాతివారు దీనిని ఆచరిస్తారు. ఒగ్గు అంటే శివుడి ఢమరుకం. ఈకథాగానంలో నలుగురు పాల్గొంటారు. పూసల దండలు ఎర్రని,తెల్లని ధోవతులు వేసుకొని ప్రధాన గాయకుడు పాడుతూ ఉంటే వాయిద్యకారులు డోలు, తాళాలు వాయిస్తూ పంతపాడుతారు. శైవ సంబంధ ఉత్సవాల్లో ఇది కనిపిస్తుంది.

**6. రంజుకథ :** విజయనగర ప్రాంతంలో ఈ కథాగానం కనిపిస్తుంది. స్తూపాకార డ్రుమ్మమీద గొర్రె చర్మం అతికించి చేతు లు కర్రలతో కొడుతూ గానం చేయడం ఇందులోని విశేషం. రంజు అనే పరికరం 11,12 శతాబ్దాల నాటిది రంజుకుడనే రాక్షసుడిని శివుడు చంపి, వాడి చర్మంతో ఈ పరికరం చేశాడనేది నమ్మకం. శైవ సంబంధ ఉత్సవాల్లో దీనిని ఆలపించుట జరుగుతుంది.

**7. బైండ్ల కథ :** బైండ్లు అనే జాతివారు ఆలపించే కథాగానం ఇది. వివిధ గ్రామాలలో ఆయా గ్రామ దేవతల కథల్ని వీరు ఆ లపిస్తారు

**8. కిన్నెరకథ :** తెలంగాణాలో డక్కలజాతి వారు దీన్ని ఆలపిస్తారు. కిన్నెర అనేది తంత్ర వాయిద్యం కథకుడు దీన్ని వాయి స్తూ సాయన్నకథ, గద్వాల రాణి కథ, చంద్రమ్మ కథ లాంటి ఇతి వృత్తాన్ని తీసుకొని కథాగానం చేస్తాడు.

**9. శారద కథ :** ఇదికూడా తెలంగాణా ప్రాంతానికి చెందినదే. శారద అనే వాయిద్యాన్ని ఉపయోగించి ముత్తరాస జాతి వా రు దీనిని వంశ పారంపర్యంగా గానం చేస్తుంటారు. ఇందులో ఎక్కువగా శైవ కథలుంటాయి.

**III. గాన నాటకాలు :**

**1. వీధి నాటకం :** ఇది సంగీత నృత్యాలలో కూడిన నాటకం కూడిచపూడి భగవతులు ప్రసిద్ధి. (నృత్యరీతుల్లో వివరించుట జరిగింది)

**2. వీధి భాగవతం :** రాజస్థాన్‌లో ప్రదర్శించే సంస్కృత నాటకాలను తెలుగులో వీధిభాగవతంగా రూపొందించిన ప్రక్రియ ఇది. కోస్తా ప్రాంతంలో దీనిని తూర్పు భాగవతంగాను, తెలంగాణాలో చిందు భాగవతంగాను, రాయలసీమలో చెంచునాట కం గాను ప్రసిద్ధి పొందింది. ఏదో ఒక పౌరాణిక ఇతి వృత్తాన్ని ఆయాపా త్రధారులు ఆహార్య, ఆంగిక, వాచిక, సాత్వికాభి నయాలతో ప్రదర్శిస్తారు. దానికి తగిన వాయిద్య పరికరాలు గాత్రధారులు కూడా ఉంటాయి

**3. పగటి వేషాలు (బహుముఖ రూపాలు) :** పగలు మాత్రమే ప్రదర్శించే వేషాలు కావడం వల్ల ఈ పేరు వచ్చింది. కృష్ణా జిల్లా 'గడ్డిపాడు' కూచిపూడి కళకు ప్రసిద్ధి. ఇందులో 60 రకాల వేషాలను ప్రదర్శిస్తారు. వీటి ద్వారా సంఘంలోని మూఢా చారాలను, దోపిడి దారులను, లంచగొండులను హాస్యధోరణిలో బట్ట బయలు చేస్తుంటారు. నేటికి ఇవి ప్రచారంలో ఉన్నాయి. ఇందులో శక్తి వేషం, భేతాళుడు, అర్ధనారీశ్వరుడు, పిట్టలదొర, బట్రాజువేషం, బుడబుక్కల వేషం మొ.వి ప్రసిద్ధి చెందినవి. పెద్దిబొట్ల జానకి రామయ్య, వసుమర్తి శేషయ్య ప్రసిద్ధి చెందిన కళాకారులు

**IV. బొమ్మలాటలు :**

**1. తోలు బొమ్మలాట :** తెలుగు వారి కీర్తిని ఖండాంతరాలకు వ్యాప్తి చేసినకళ ఇది. 'బొందిలీలు' అనే వారు. ఈ ప్రదర్శన ను ఎక్కువగా నిర్వహిస్తారు. ఇందులో పురాణాగాథలు ప్రదర్శిస్తారు. పలుచని తెరవెనుగ ఆముదపుదీపాలు అమర్చి ఆ వె లుగులో బొమ్మలు ఆడిస్తూ ప్రదర్శిస్తారు. ఈ బొమ్మలను దేవతలవైతే జింక చర్మంతో, రాక్షసులవైతే మేక చర్మంతో తయారు చేస్తారు. వినాయకుడి బొమ్మ తెరమీదకు రావడంతో ప్రదర్శన ప్రారంభమవుతుంది. ఇందులో హార్మోనియం, తబలా ఉప

యోగించి పాత్రాలను బట్టి గానం చేస్తారు. జుట్టు పోలిగాడు. అల్లాటప్పుడు, బంగారక్క లాంటి హాస్యపాత్రలు మధ్యలో వస్తుంటాయి. అనంతపురం జిల్లా నిమ్మలకుంట, కడప జిల్లా రాయచోటి ఈ కళకు ప్రసిద్ధి.

**2. జుట్టబొమ్మలాట :** ఎత్తైన బొమ్మలు ధరించి నాట్యగాళ్ళు కనిపించకుండా ప్రదర్శించే కళారూపం ఇది.ఇలాంటి నృత్యం ఎక్కువగా తిరునాళ్ళు, జాతరలలో ప్రత్యేక ఆకర్షణ.రంపపుపొట్టు ఎండుగట్టి పేడతో చేసే బట్ట బొమ్మలు కొన్ని పది అడుగులు ఎత్తు వరకు కూడా ఉంటాయి. ఈ ప్రదర్శనలో వాయిద్య పరికరాల వింత శబ్దాలతో నృత్యం చేస్తూ చూపరులను ఆనంద పరుస్తారు.

**V. జంతువులతో ప్రదర్శించే ఆటలు :**

జానపదులు వివిధ జంతువులను మచ్చిక చేసుకొని వాటికి శిక్షణ నిచ్చి ఆటలు ఆడించుట గ్రామాలలో నేటికీ కనిపిస్తుంది.

**1. గంగిరెద్దు ప్రదర్శన :** తెలుగు ప్రాంతాలలో సంక్రాంతి పండుగ రోజుల్లో కనిపించే ప్రధానమైన ఆట ప్రదర్శన గంగిరెద్దు ఆట. ఎద్దు, గేదెలను అందంగా అలకరించి శివపార్వతుల,సీతారాములు పెళ్ళి వృత్తాంతాన్ని పాడుతూ ఆట ఆడించడం చివరగా ఇంటింటికి వెళ్ళి,ఊగొట్టడం ఈ ప్రదర్శనలో ప్రదానమైనది.

**2. దొమ్మరాట/బుడబుక్కలాట :** వీధుల్లోనూ మైదానాలలోనూ, కుటుంబం మొత్తం ఈ ప్రదర్శనలో పాల్గొంటూ 'కోతి'చేత కూడా, కొన్ని ఆటలు ఆడించడం కనిపిస్తుంది. కోతి ప్రదర్శించే ఆటలకు తోడు వీటి యజమాని హాస్యపు సంభాషణలతో ప్రేక్షకులను ఆకట్టుకోవడం జరుగుతూ ఉంటుంది.

**3. నాగుపాము నాట్యం :** నాగుపామును పట్టి పుట్టలోపెట్టుకొని వీధి కూడలల్లో ఈ పాములతో ఆటలు ఆడించడం జరుగుతుంది. నాదస్వరం ఊదుతూఉంటే దానికి అనుగుణంగా పాముఆడడం చూపర్లను బాగా ఆకట్టుకుంటుంది.

**4.ఎలుగుబంటి ప్రదర్శన :** చాలా అరుదుగా కనిపించే జంతుప్రదర్శనలో ఎలుగుబంటి ప్రదర్శన కూడా ఒకటి ప్రమాదకరమైన ఈ ఎలుగుబంటి ప్రదర్శనలో వాటిని మచ్చిక చేసుకున్న చెంచులు ఇంటింటికి తిరుగుతూ ఇంటి ముందర ఎలుగుబంటితో దండాలు పెట్టించి ఆకర్షించడం జరుగుతుంది.

**5.చిలుకజోస్యం :** గ్రామాలలో మొదలైన ఈ జానపద కళారూపం నేటికీ బాగా ప్రచారంలో ఉంది. పట్టణాలో సైతం ఎక్కడో ఒక చోట ఈ 'చిలుక జోస్యం' కనపడుతూనే ఉంటోంది. పంజరంలో ఉన్న చిలుక యజమాని తలుపు తెరవగానే బయటి వచ్చి ముందర పరిచి వున్న పత్రికలలో ఏదో ఒకటి తన ముక్కతో అందుకుని యజమాని చేతికి అందించి తిరిగి పంజరంలోనికి వెళ్ళిపోతుంది.

ఈ విధంగా తెలుగు ప్రాంతాలలోని జానపద కళారూపాలు ప్రజలనురంజింప చేస్తూ, వాటి లక్ష్యాన్ని నెరవెరుస్తూ అనేక మందికి జీవనాధారంగా ఉంటూ, కొనసాగుతూ ఉన్నాయి. కాలనుగుణంగావచ్చిన మార్పుల వల్ల గ్రామాలలోని ప్రజల జీవనవిధానంలో మార్పురావడం వల్ల ఈ జానపద కళారూపాలకు ఆదరణ తగ్గుతున్నట్లు మనం గుర్తించవచ్చు.

**ఆధార గ్రంథాలు :**


1. ఆంధ్రుల జానపద విజ్ఞానం – ఆర్.వి.యస్. సుందరం – 2004
2. జానపద విజ్ఞానాధ్యయనం – జి.ఎస్. మోహన్ – 2001
3.తెలుగు జానపద గేయ సాహిత్యం – బిరుదరాజ రామరాజు – 1978
4. జానపద విజ్ఞాన వ్యాసాలు – నేదునూరి గంగాధరం – 2003
5. తెలుగు – తమిళం పోడుపుకథలు – తులనాత్మక పరిశీలన – టి.సూర్యనారాయణ రెడ్డి – 2001